6 నుంచి 30 వరకు ఇంటింటి సర్వే

- రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మంది ఎన్యూమరేటర్లు
- ప్రజలంతా సహకరించాలి: మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబర్1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 30 వరకు ఇంటింటి సమగ్ర సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే) నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడు ఉంటారని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రతి ఇంటికీ తిరిగి కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారని తెలిపారు. 30లోగా డేటా ఎంట్రీతో పాటుగా సమాచార సేకరణను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించుకున్నదని తెలిపారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అన్నిరకాల పథకాలు పొందేందుకు ఈ సర్వే దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ సమగ్ర సమాచారం తెలుపాలని కోరారు.

సహకార సంస్థలను బలోపేతం చేయాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, నవంబర్1 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి, రైతులకు మెరుగైన సేవలను అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కోఆపరేటివ్, మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాల్లో రైతులకు సులభతరంగా, సమర్థవంతంగా సేవలు అందేలా రీ-ఆర్గనైజేషన్ చేయాలని తెలిపారు. డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో జరిగిన అవకతవకలపై విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మార్కెట్, జిన్నింగ్ మిల్లులకు వచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని, అధికారులు, సెక్రటరీలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వాట్సాప్ నంబర్ 88972 81111 ద్వారా వెయిటింగ్ టైమ్, పేమెంట్ స్టేటస్, ఫిర్యాదుల ఫోరం, ఇతర సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్, డైరెక్టర్ కో ఆపరేటివ్ ఉదయ్‌కుమార్, అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పామ్‌ఆయిల్ సాగును పెంచాలి

రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగును మరింతగా పెంచేందుకు అధికారులు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సూచించారు. ఆయి ల్ ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, జీఎం సుధాకర్‌రెడ్డితో మంత్రి శుక్రవారం భేటీ అయ్యారు. గెలల ధర టన్నుకు రూ. 19,144కు చేరడంపై ఆయిల్ ఫెడ్ సిబ్బందిని అభినందించారు. మలేసియా పద్ధతులను పాటిస్తూ, పామ్ ఆయిల్ రైతుల వృద్ధికి తోడ్పడాలని మంత్రి సూచించారు.

పోలవరం ముంపుపై సర్వే చేపట్టండి

కేంద్ర జల్‌శక్తిశాఖకు తెలంగాణ సర్కారు లేఖ

హైదరాబాద్, నవంబర్1 (నమస్తే తెలంగాణ): పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో ఏర్పడుతున్న ముంపుపై తక్షణమే సర్వే చేపట్టాలని కేంద్ర జల్‌శక్తిశాఖకు తెలంగాణ సాగునీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ శుక్రవారం లేఖ రాశారు. పోలవరం ముంపు తదితర సాంకేతిక అంశాలపై గతంలో నిర్వహించిన సమావేశానికి సంబంధించి సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) రూపొందించిన మినట్స్‌ను ఆక్షేపించారు. ఏపీ చెప్పని అభిప్రాయాలను కూడా చెప్పినట్లుగా సీడబ్ల్యూసీ పొందుపరిచిందని తప్పుబట్టారు. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ముంపు వాటిల్లనుందని, ఆ చోట మాత్రమే డిమార్కేషన్ చేస్తామని ఏపీ చెప్పినట్టుగా మినట్స్‌లో పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సమావేశంలో ఏపీ అలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేయలేదని తేల్చిపారేశారు. తెలంగాణలో అన్ని ముంపుప్రాంతాలను డిమార్కేషన్ చేయాలని గతంలోనే ఎన్జీటీ ఆదేశించిందని, ఏపీ కూడా అందుకు ముందుకు వచ్చిందని వివరించారు. ఇప్పటికైనా సమగ్ర సర్వేను పూర్తి చేసేలా పీపీఏను, ఏపీ ఆదేశించాలని కేంద్రజలశక్తిశాఖను కోరారు.

మంత్రిగారి కంపెనీ కోసం..

మొదటిపేజీ తరువాయి...

కావాల్సిన వాళ్ల జేబుల్లో వందల కోట్లు నింపడమే గ్లోబల్ టెండర్లలో వెనుక అసలు ఉద్దేశం.

భారీ దోడిపీకి స్కెచ్

విద్యుత్తు శాఖలో ఏ పనులు చేపట్టాలన్నా ఆ సంస్థలో నమోదు చేసుకున్న కాంట్రాక్టర్ల నుంచే టెండర్‌లు పిలుస్తారు. ప్రక్రియలో ఎంపిక చేసిన వారికి పనులు అప్పగిస్తారు. కానీ ప్రస్తుతం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లో సుమారు 4వేలకు పైగా విద్యుత్ కాంట్రాక్టర్లు కొన్నేళ్ల నుంచి పనులు చేస్తున్నారు. ఇంతమంది అనుభవమున్న స్థానిక కాంట్రాక్టర్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వారెవరినీ లెక్కలోకి తీసుకోవడం లేదు. ఎందుకంటే కాంట్రాక్టు ఎవరికి ఇవ్వాలో 'సచివాలయంలో పెద్దలు' ముందే డిసైడ్ చేసి అందుకు అనుగుణంగా చకచకా పావులు కదుపుతున్నారు.

అసలేంటీ కాంట్రాక్టు ?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భవిష్యత్ విద్యుత్తు అవసరాల కోసం సుమారు 245 సబ్ స్టేషన్‌లు, నెట్‌వర్క్ పనులను చేపట్టేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మొదటి దశలో

సుమారు 58 సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి పాత పద్ధతిలోనే టెండర్లు పిలిచారు. అంతలో ఏమైందో కానీ ఆ టెండర్లను రద్దు చేశారు. వాటి స్థానంలో గ్లోబల్ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తున్నది. మొత్తం 245 సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తే రూ.1500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. కానీ గ్లోబల్ టెండర్ల ద్వారా పనులు చేపడితే అదనంగా మరో రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని డిస్కమ్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రలో తిరస్కరణ.. తెలంగాణలో ఆదరణ

తెలంగాణలో ఓ మంత్రికి చెందిన కంపెనీ నిరుడు ఏపీలో విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించిన పనులను దక్కించుకుంది. పనులను సకాలంలో చేపట్టకపోవడంతో ఏపీ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు పనులు ఎందుకు చేయడం లేదో చెప్పాలంటూ ఈపీడీసీఎల్ నోటీసులను జారీ చేసిందని తెలిసింది. కొన్ని రోజులకు ఆ పనుల టెండర్లను ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. అక్కడ కాంట్రాక్టు సంస్థ వద్ద సుమారు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల విలువ చేసే విద్యుత్తు సామాగ్రి మిగిలిపోయింది. ఆ సామాగ్రిని వినియోగించుకునేందుకు తమకున్న అధికార అండదండలతో తెలంగాణలోని విద్యుత్తు శాఖల్లో పనులను దక్కించుకునే ప్రయత్నం మొదలు పెట్టింది సదరు సంస్థ.

ఖర్చు పెంచి... జేబులు నింపి

నమోదిత కాంట్రాక్టర్లు పోటీ పడి విద్యుత్తు శాఖ నిర్ణయించిన ధర కంటే 10-15 శాతం తక్కువకే పనులు చేసేందుకు టెండర్ వేసేవారు. గ్లోబల్ టెండర్లు పిలవడం ద్వారా భారీ కంపెనీలు మాత్రమే ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. పనుల అంచనా వ్యయం ముందు నిర్ణయించిన ధర కంటే 10-20 శాతం ఎక్కువగా చేసి గ్లోబల్ టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంది. గ్లోబల్ టెండర్ల ద్వారా విద్యుత్ శాఖ పనులన్నీ బడా కంపెనీలకే కేటాయిస్తే విద్యుత్ సంస్థకు పెద్ద మొత్తంలో నష్టం కలుగుతుంది. ఇదంతా కూడా మంత్రి కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు అనేది సుస్పష్టం.

గ్లోబల్ టెండర్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

విద్యుత్తు శాఖలో గ్లోబల్ టెండర్లను ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. తెలంగాణ వ్యాప్తంగా 3500 నుంచి 4000 వరకు విద్యుత్తు శాఖ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఉన్నారు. ఉమ్మడి ఏపీలో నమోదిత కాంట్రాక్టర్ల ద్వారానే పనులు చేపట్టేవారు. విద్యుత్ సంస్థలకు లాభాలు వచ్చే విధంగానే స్థానిక కాంట్రాక్టర్లు పనులు చేశారు. గ్లోబల్ టెండర్లు పిలిస్తే సంస్థ కోట్ చేసిన దానికంటే ఎక్కువ కోట్ చేస్తుంది. విద్యుత్ శాఖపై అదనంగా భారం పడుతుందే తప్ప, లాభం ఉండదు. ప్రభుత్వంలోని పెద్దలే గ్లోబల్ టెండర్ల విధానాన్ని తీసుకు వచ్చి తమ వారికి లాభం చేకూరేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

– నక్కా యాదగిరి, తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ఓవరాక్షన్ వద్దు!

- బాధ్యత లేని ప్రకటన ఎలా చేస్తరు?
- పొంగులేటిని నిలదీసిన ఢిల్లీ దూత!
- వయనాడ్ నుంచి అర్జెంటుగా హైదరాబాద్‌కు
- నంబర్ 2 కోసం ఇలాంటి వ్యాఖ్యలా అని మండిపాటు
- రాత్రికిరాత్రే వచ్చి తలంటి వెళ్లిన అధిష్ఠానం బంటు

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ) : దీపావళి ముందే పొలిటికల్ బాంబులు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం,అసహనం వ్యక్తం చేసిందా? ఈమేరకు గురువారం రాత్రి వయనాడ్ నుంచి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు ఆగమేఘాల మీద వచ్చిన ఢిల్లీ దూత పొంగులేటిని పిలిపించి ముఖ్యనేత సమక్షంలోనే తలంటారా? అంటే 'అవును' అని కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. 'అధికారం చేతిలో ఉంటే ఇంటి ఫంక్షన్ల మీద పోలీసులతో దాడులు చేయిస్తారా? రేప్పొద్దున ప్రజలకు ఏమని సమాధానం చెప్తారు? ఈ మాత్రం పనికి పొలిటికల్ బాంబులు పేలుతాయని ప్రకటనలు చేస్తారా? ఏవీ పొలిటికల్ బాంబులు?' అంటూ నిలదీసినట్టు తెలిసింది. ఇలాంటి బాధ్యతా రాహిత్యమైన ప్రకటనలతో ప్రజల్లో చులకనైపోతామని, ఈ ప్రభావం ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై పడి పార్టీ ఆగమయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం.

రెండు జిల్లాల నేతల ఫిర్యాదు

కేటీఆర్‌ను, బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టే ప్రయత్నంలో భాగంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పొలిటికల్ బాంబులనే కుట్రకు తెరలేపారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మూసీ నదికి, దక్షిణ కొరియాలోని సియోల్ పట్టణంలో ఉన్న చుంగ్ గై చున్ వాగుకు ముడిపెడుతూ అధ్యయనం కోసం తెలంగాణ ప్రభుత్వం కొందరు మంత్రులు, అధికారులు, జర్నలిస్టులను అక్కడికి పంపిన సంగతి తెలిసిందే. మూసీ నదికి, చుంగ్ గై చున్ కాల్వకు అసలు పొంతనే లేదని కొందరు జర్నలిస్టులు తేల్చిచెప్పిన నేపథ్యంలో.. డైవర్షన్ పొలిటిక్స్‌లో భాగంగా పొంగులేటి పొలిటికల్ బాంబులు అంటూ కథలు చెప్పడంతో ఆయన వాఖ్యలు బూమరాంగ్ అయ్యాయి. ఆయన సంచలన వ్యాఖ్యలు చేయడంతో ఏం జరుగబోతుందోనని ప్రజలు కూడా ఆసక్తిగా గమనించారు. ఏం జరుగుతుందో తెలియక ఇటు పాలక పక్షం నేతలు కూడా గందరగోళంలో పడ్డారు. ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఖమ్మం, నల్లగొండ జిల్లాల కీలక నాయకులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కేవలం తన వ్యక్తిగత మైలేజీని పెంచుకునేందుకు, ప్రభుత్వంలో నంబర్ 2 అనే ఇమేజ్‌ను సంపాధించుకోవాలనే అత్యుత్సాహంతోనే బాధ్యత లేని వ్యాఖ్యలు చేశారని వారు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి మేలూ జరగక పోగా.. ప్రభుత్వమే ఇరుకున పడే పరిస్థితి వచ్చిందని, ఆయనను కంట్రోల్ చేయకపోతే పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర నష్టమని వారు ఫిర్యాదులో పేర్కొనట్టు సమాచారం.

పొంగులేటి తీరుపై అధిష్ఠానం సీరియస్

నేతల ఫిర్యాదును సీరియస్ తీసున్న కాంగ్రెస్ అధిష్ఠానం సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జిని పంపినట్టు తెలిసింది. కేరళలోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల బిజీలో ఉన్న ఆయన అధిష్ఠానం ఆదేశాలతో అత్యవసరంగా తన షెడ్యూల్‌ను మార్చుకొని దీపావళి పండగరోజు (గురువారం) రాత్రి హైదరాబాద్ వచ్చినట్టు తెలిసింది. రాత్రి ఇక్కడే బసచేసి ముఖ్యనేతతో పాటు పొంగులేటిని కూడా పిలిపించి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఏ సందర్భంలో ఇలాంటి ప్రకటన చేయాల్సి వచ్చిందో చెప్పాలని అడిగినట్టు తెలిసింది. పొంగులేటి ఇచ్చిన వివరణ మీద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన 'అరెస్టులు, ఎంక్వైరీల మీద మాట్లాడటానికి మీరు హోం మంత్రి కాదు కదా?' అని గట్టిగానే నిలదీసినట్టు విశ్వసనీయ సమాచారం. పరిపాలన అంటే పరాచికాలు కాదని, పాలన మీద దృష్టి పెట్టాలని కరాఖండిగా చెప్పినట్టు తెలిసింది. ఢిల్లీ దూత చిందులు చూసి ముఖ్యనేతతో పాటు పొంగులేటి నీళ్లు నమిలినట్టు సమాచారం.

తుస్సు బాంబులే

- పొంగులేటి పొలిటికల్ బాంబులు పేలలే!
- గురి తప్పిన ఫార్ములా ఈ రేసు కేసు
- విచారణ పూర్తి కాకుండానే.. నివేదిక రాకుండానే కాళేశ్వరం, విద్యుత్తు కొనుగోళ్లపై చర్యలా?
- పొంగులేటి మాటలు తుపాకీ రాముడి తూటాలే..
- సోషల్ మీడియాలో జోకులు

సియోల్ నుంచి మనం పోయిన తర్వాతనో.. లేదా ఆ తర్వాత రెండు మూడు రోజుల్లో ఒకటో, రెండో పొలిటికల్ బాంబులు పేలుతాయి..

–ఇటీవల దక్షిణ కొరియా టూర్‌లో మంత్రి పొంగులేటి చెప్పిన మాటలివి

బాంబుల మాట అటుంచితే.. కనీసం తోక పటాక కూడా పేలలేదు.. పొంగులేటి మాటలే నాగుంబాము బిళ్ల లెక్క బుస్సుమని పొంగి గబ్బువాసన వచ్చింది..

– సోషల్ మీడియాలో పేలిన సెటైర్

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ) : దీపావళికి ముందే పేలుతాయన్న పొలిటికల్ బాంబులు కనీసం తుస్సుమని కూడా అనలేదు! దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేలుస్తామన్న పొలిటికల్ బాంబ్ తుపాకీ రాముని తూటా వంటిదేనని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. పొంగులేటి కామెంట్స్ పొలిటికల్ సర్కిల్స్‌లోనూ సంచలనంగా మారాయి. మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో వీటిపై జోరుగా చర్చసాగింది. సమావేశం తర్వాత నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కూడా 'అగో..దీపావళి ముందు రోజు పేలబోతుంది' అని ప్రకటించారు. దీపావళి పండుగ ముగిసినా.. ఎలాంటి పొలిటికల్ బాంబులు పేలకపోవటంతో పొంగులేటి మాటలు డైవర్షన్ పాలిటిక్సే అని అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్ములా ఈ రేస్‌పై దృష్టి పెట్టింది. రేస్ నిర్వహించే కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా నిధులు కేటాయించారని ముఖ్యమంత్రే ఆరోపిస్తూ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్న విషయం తెల్సిందే. పదినెలలుగా ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో కాంగ్రెస్ ముఖ్యులు అనేక వేదికలపై ప్రశ్నించారు. ప్రస్తుతం పొంగులేటి చెప్పిన దీపావళి బాంబు కూడా ఫార్ములా రేసుకు సంబంధించినదే అయ్యుండొచ్చని ప్రచారం జరిగింది. దీనిపై ఏసీబీకి ఫిర్యాదు చేశామంటూ ప్రభుత్వమే లీకులిచ్చింది. ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో నివేదిక తెప్పించుకున్నది. ఆయనకు నోటీసులు కూడా ఇచ్చింది. ఇప్పుడు అదే అంశాన్ని తెర మీదికి తెచ్చినట్టు తెలుస్తున్నది. ఈ విషయంలో కేటీఆర్ ప్రమేయం ఎక్కడా

లేకున్నా, ఆధారాలు లేకున్నా ఎలా ముందుకు వెళ్తామని ఈ రేస్ కేసును పక్కన పెట్టినట్టు తెలిసింది.

విచారణ పూర్తికాకుండానే..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని.. బీఆర్ఎస్ నేతలు కోట్లు దోచుకున్నారని ఎన్నికల ముందు నుంచే రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. అధికారంలో వచ్చిన వెంటనే దీనిపై విచారణ కమిషన్ వేశారు. ఈ కమిషన్ నుంచి ఎలాంటి నివేదిక రాకుండానే దీపావళి బాంబు అంటూ ప్రకటించడం కుట్రలో భాగమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కూడా తుదిదశకు చేరుకున్నదని.. ఈ విషయంలోనూ చర్యలుంటాయన్న ప్రచారం సాగింది. కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకే వారి రాజకీయ ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ధరణికి సంబంధించి కూడా బీఆర్ఎస్ సర్కార్‌పై కాంగ్రెస్ ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఒక్క ఆధారం కూడా చూపకుండా ఎలా చర్యలు తీసుకుంటారని, అందుకే పొంగులేటి బాంబులు పేలలేదన్న చర్చ పొలిటికల్ సర్కిళ్లలో జోరుగా కొనసాగుతున్నది.

- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి నిరసన సెగ

జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి నిరసన తెగ తాకింది. డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న క్రమంలో గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్థానికులు ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 40 మంది డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.50 వేల చొప్పున ఇస్తానని ప్రకటించి ఓట్లు అడిగారని, గెలిచిన తర్వాత ఆ హామీని పట్టించుకోకపోవడంపై గిర్ని తండావాసులు నిరసన తెలుపుతూ వినతిపత్రం అందజేయగా హామీలను నెరవేరుస్తామంటూ వెనుదిరిగారు.

– కొడకండ్ల

త్వరలో రాష్ట్రానికి కొత్త సీఎం!

మొదటిపేజీ తరువాయి...

వెళ్లినా రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రియాంక నామినేషన్ కార్యక్రమం కోసం వాయనాడ్‌కు వెళ్లినా కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. త్వరలో రేవంత్ రెడ్డి సీటుకు ఎసరు పడబోతున్నదని చెప్పారు. మూసీ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.50 వేల కోట్ల నుంచి రూ.లక్షన్నర కోట్లకు పెంచారని, ఇందులో భారీ కుంభకోణం జరుగబోతున్నదని అధిష్ఠానం భావిస్తున్నదని తెలిపారు. సీఎం భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు భావిస్తున్నారని, దీనిని అధిష్ఠానం కూడా నమ్ముతున్నట్లు చెప్పారు. తమకు ఏమీ దొరక్కుండా చేస్తున్నారంటూ కొందరు కాంగ్రెస్ నేతలు ఒక గ్రూప్‌గా ఏర్పడి ఢిల్లీలో భేటీ అయ్యారని ఆరోపించారు. ముఖ్యంగా ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం పార్టీ హైకమాండ్‌కు తలనొప్పిగా మారిందని పేర్కొన్నారు. హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్‌మెంట్లపై హైకమాండ్‌కు నివేదికలు పంపుతూనే ఉన్నారని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, కేవీపీ రామచందర్‌రావు తదితరుల ప్రాపర్టీలపై ఒక సీనియర్ నేత మూసీ అంశంపై సోనియా గాంధీకి నేరుగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోనియా ఆదేశంతో డీకే శివకుమార్ రంగంలోకి దిగి, విచారణ చేస్తున్నారని చెప్పారు. సీఎం రేసులో ముగ్గురు సీనియర్ మంత్రులు ఉన్నారని, వారు పూస గుచ్చినట్టు అన్ని విషయాలు ఢిల్లీ పెద్దలకు వివరిస్తున్నారని తెలిపారు.

కుమారులు అన్నం పెట్టడం లేదని..

- కాల్వలోకి దూకిన వృద్ధురాలు
- కాపాడిన స్థానికులు

హాలియా, నవంబర్ 1 : కుమారులు అన్నం పెట్టడం లేదని ఓ తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన హృదయ విదారక ఘటన నల్లగొండ జిల్లా హాలియాలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై సతీశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండల కేంద్రానికి చెందిన ఊరె ముత్తమ్మకు ఇద్దరు కుమారులు. ముత్తమ్మకు ఇదివరకే రెండు కాళ్లు విరిగాయి. ఇద్దరు కొడుకులు ఉండి కూడా తన యోగక్షేమాలు చూసుకోవడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం హాలియాకు వచ్చి ఆత్మహత్య చేసుకునేందుకు సాగర్ ఎడమ కాల్వలో దూకింది. వెంటనే స్థానికులు గుర్తించి కాల్వలోకి దూకి ముత్తమ్మను కాపాడారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ముత్తమ్మ

రోడ్డెక్కిన గురుకుల విద్యార్థులు

- సమస్యలు తీర్చాలని డిమాండ్
- కొత్తగూడెం చౌరస్తాలోని హైవేపై ఆందోళన

బాటసింగారం వద్ద హైవేపై బైఠాయించిన గురుకులం విద్యార్థులు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 1: గురుకుల విద్యార్థులు రోడ్డెక్కారు. తమ సమస్యలపై గళం విప్పారు. ముషీరాబాద్, చార్మినార్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల క్యాంపస్‌ను రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్నారు. గురుకులంలో వసతులు లేవని, చదువులు సరిగా చెప్పడం లేదని, ఆహారం సరిగా ఉండటంలేదని విద్యార్థులు శుక్రవారం దాదాపు కిలోమీటర్ నడిచి వచ్చి బాటసింగారం వద్ద కొత్తగూడ చౌరస్తాలో జాతీయ రహదారిపై బైఠాయించి తమ సమస్యలను తీర్చాలని నినదించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఓ వైపు అతివేగంగా వెళ్తున్న వాహనాల పక్కనే కూర్చొని ధర్నాకు దిగడం ఆందోళన కలిగించే విషయం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సిన ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శక్తివంతమైన క్షిపణిని ప్రయోగించిన ఉత్తర కొరియా

సియోల్, నవంబరు 1: ఉత్తర కొరియా సరికొత్త బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. గురువారం హ్వాసంగ్-19 అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్టు ఆ దేశ అధికారిక టీవీ ఛానల్ ప్రకటించింది. వీడియోను సైతం ప్రసారం చేసింది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, ఆయన కుమార్తె ఈ ప్రయోగాన్ని చూస్తున్నట్టుగా వీడియోలో కనిపించింది. ఘన ఇంధనంతో నడిచే ఈ క్షిపణి ప్రపంచంలోనే శక్తివంతమైన వ్యూహాత్మక క్షిపణి అని కేసీఎన్ఏ ప్రకటించింది. ఈ క్షిపణి అమెరికాలోని ఏ ప్రాంతాన్నైనా చేరుకోగల సామర్థ్యం ఉన్నట్టు చూపించుకుంది.

ఏడాదికి ఓ వ్యక్తి సగటు ఖర్చు రూ. 1,623

తాగుడులో మనమే ఫస్ట్

ఆరు నెలల్లో బీర్లు తాగిన 3.3 కోట్ల మంది • ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 01(నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మద్యం ఏరులై పారుతున్నది. మద్యం విక్రయాలు నియంత్రిస్తామని, బెల్టు షాపులు మూసివేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మర్చిపోయింది. పైగా కార్యకర్తలకు ఉపాధి మార్గంగా బెల్టు షాపులు పెట్టుకోవాలని ప్రోత్సహిస్తోంది. గ్రామాల్లో దిగువ శ్రేణి కార్యకర్తలు అడిగిందే తడువుగా బెల్టు దుకాణాలు పెట్టుకోవాలని అధికార పార్టీ నేతలు సూచిస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ-(ఎన్ఐపీఎఫ్‌పీ) 'రెవెన్యూ మొబిలైజేషన్ ఫ్రమ్ టాక్సెస్ ఆన్ ఆల్కహాల్ బేవరేజస్' అంశంపై సర్వే చేయగా తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం దక్కించుకుంది. సర్వేలో కీలక అంశాలు వెల్లడయ్యాయి.

ఖజనాలకు కిక్కు.. జనాలకు మత్తు

దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్ఐపీఎఫ్‌పీ సర్వే చేసింది. మద్యంపై పెడుత